మద్యం జోరు

గ్రామాల్లో యథేచ్ఛగా గొలుసు దుకాణాల నిర్వహణ

న్యూస్‌టుడే, మెట్‌పల్లి, కోరుట్ల

మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ల పరిధిలో మద్యం దందా జోరుగా సాగుతోంది. ఊరికి ఐదారు మద్యం గొలుసు దుకాణాలు వెలిశాయి. వీటికి తోడు దాబాల్లో సిట్టింగ్ యథేచ్ఛగా నడుస్తోంది. ఇంత జరుగుతున్నా అటు పోలీస్ ఇటు ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది.

జిల్లాలో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు ఉండగా గ్రామాలు, పట్టణాల్లో మద్యం గొలుసు దుకాణాలు పెద్దఎత్తున వెలిశాయి. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వహణ సమయానుసారం ఉండగా గొలుసు దుకాణాలకు మాత్రం ఎలాంటి నిబంధనలు లేవు. ఏ సమయంలోనైనా మద్యం లభిస్తోంది. ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే వరకు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో నిర్వహించే గొలుసు దుకాణాలు లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల యాజమాన్యాలకు ప్రధాన ఆదాయ వనరుగా మారాయని, దీంతో వాటిని వీరే ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. మద్యం గొలుసు దుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్నది బహిరంగ రహస్యమే అయినా స్థానిక పోలీస్, ఎక్సైజ్ అధికారులు వీటిపై కనీస దాడులు చేసిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. గతంలో మెట్‌పల్లి ఎక్సైజ్ పరిధిలో గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా అంశంపై సామాజిక మాధ్యమాల్లో ఓ ఆడియో వైరల్ అయ్యింది. ఇటీవల ఐదారు రోజుల కిందట మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో నాలుగు మద్యం గొలుసు దుకాణాలకు బంద్ చేయాలని యువత పేరిట పోస్టర్లు వెలిశాయి. మద్యం గొలుసు దుకాణాలు ఏ మేరకు నడుస్తున్నాయో ఈ అంశంతో తేటతెల్లం చేస్తున్నాయి.



గొలుసు దుకాణంలో మద్యం సీసాలు

దాబాల్లోనే సిట్టింగ్

మద్యం గొలుసు దుకాణాలకు తోడు దాబాల పేరుతో మద్యం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. దుకాణాల ముందు దాబా అని బోర్డు రాసి ఉంటుంది. లోపల మాత్రం బార్ అండ్ రెస్టారెంట్లను తలపించే విధంగా ఉంటుంది. మెట్‌పల్లి, కోరుట్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని జిల్లా సరిహద్దు నుంచి మొదలు కోరుట్ల శివారు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. మెట్‌పల్లి, కోరుట్ల మండలాల్లోని గ్రామాల్లో సైతం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. నచ్చిన వంటకాలు వండివ్వడం, ఇష్టమైన మద్యం బ్రాండ్లను అందుబాటులో ఉంచడం విశేషం. అనధికారికంగా మద్యం విక్రయిస్తూ టేబుళ్లు, కుర్చీలు వేసి మరీ సిట్టింగ్‌లు నిర్వహిస్తుండడం గమనార్హం. మద్యం మత్తులో అపుడపుడు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమవుతోంది.

వేలం కారణమే!

గ్రామాల్లో అనధికారికంగా కొనసాగుతున్న గ్రామాభివృద్ధి కమిటీలు ఆదాయం కోసమంటూ వేలం నిర్వహించడం మద్యం గొలుసు దుకాణాల నిర్వహణకు కారణమవుతోంది. వేలం నిర్వహించి మద్యం గొలుసు దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిస్తూ, వారి వద్దే మద్యం కొనుగోలు చేయాలన్న నిబంధన పెడుతున్నారు. దీంతో గొలుసు దుకాణాలతో పాటు మద్యం సిట్టింగ్‌లు కూడా నిర్వహిస్తున్నారు. గతంలో కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో మద్యం గొలుసు దుకాణం నిర్వాహకుడిని డబ్బులు చెల్లించాలని వీడీసీ అడగగా ఆయన కేసు పెట్టడంతో పంచాయితీ ఠాణాకు చేరింది. దీంతో వీడీసీ సభ్యులను పోలీసులు బైండోవర్ చేశారు.

ఎన్నికల సమయంలోనే బైండోవర్లు?

గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణాల నిర్వాహకులను కేవలం ఎన్నికల సమయంలోనే ఆయా శాఖల అధికారులు గుర్తిస్తారు. గతేడాది జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో మెట్‌పల్లి, కోరుట్ల సర్కిల్ పరిధిలో మద్యం గొలుసు దుకాణాల నిర్వాహకులను బైండోవర్ చేయడంతో పాటు మద్యం నిల్వలను పట్టుకున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత పట్టించుకునే నాథుడే కరవయ్యారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా గొలుసు దుకాణాలతో పాటు దాబాల్లో మద్యం సిట్టింగ్‌లను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా, మెట్‌పల్లి డివిజన్ పరిధిలో మద్యం గొలుసు దుకాణాల నియంత్రణతో పాటు దాబాల్లో మద్యం సిట్టింగ్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

ఫొటోగ్రఫీ, లఘుచిత్రం పోటీలు

జగిత్యాల: జిల్లాలో పోలీసు ఫ్లాగ్‌డే సందర్భంగా యువతకు ఫొటోగ్రఫీ, లఘుచిత్రం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రాష్ట్రస్థాయి పోటీల కోసం పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపేవిధంగా మూడు ఫొటోలు, లఘుచిత్రం తీసి ఈనెల 20 సాయంత్రంలోగా సమీప పోలీసుస్టేషన్‌లో ఇవ్వాలన్నారు.

ప్రతిపాదనల్లోనే నారసింహుడి పూలవనం

పూలదండల వ్యయంతో ఆలయానికి భారం

న్యూస్‌టుడే, ధర్మపురి



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సొంతంగా పూలమొక్కల వనాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన కార్యరూపం దాల్చడం లేదు. ఐదేళ్లుగా ఇది ప్రతిపాదనలోనే ఉండిపోయింది. దీంతో ఏటా ఆలయానికి సంబంధించిన పూల వ్యయం భారంగా మారడంతో పాటు.. అనుకున్నంత లక్ష్యం నెరవేరడం లేదు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉగ్ర, యోగ, శ్రీ వేంకటేశ్వర, గోపాలకృష్ణ స్వామి ఆలయాలున్నాయి. వీటితోపాటు నిత్యం స్వామివారి నిత్య కళ్యాణోత్సవం జరుగుతుంది.

ప్రతినెలా రూ.1.30 లక్షల వ్యయం..

ప్రతినెలా ఆలయాల్లోని స్వామివార్లకు పూల దండలు, తులసీ మాలలు కలిపి రూ.1.30 లక్షల వరకు వ్యయం అవుతోంది. దీంతోపాటు దసరా, నరసింహ నవరాత్రి ఉత్సవాలకు రూ.3 లక్షల వరకు, బ్రహ్మోత్సవాలకు రూ.5 లక్షల వరకు వ్యయం అవుతోంది. దీనికి ఆన్‌లైన్‌లో టెండరు నిర్వహిస్తున్నారు. పూల వనానికి సంబంధించిన ప్రతిపాదనలను అప్పటి అధికారులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదించారు. అయితే కమిషనర్ నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయింది.

స్థలం, నీటి వసతులున్నా..

దేవస్థానానికి సంబంధించిన ఒకటి రెండు స్థలాల్లో పూల వనాలను పెంచితే బాగుంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. బుద్దేశ్‌పల్లె సమీపంలో దేవస్థానానికి ఓ భక్తుడు 20 గుంటల స్థలాన్ని బహూకరించారు. ఈ స్థలంలో కొన్నిరోజులు మామిడి మొక్కలు పెంచారు. అనంతరం ఆలయ అధికారులు విస్మరించారు. ఈ స్థలంలో పెద్దఎత్తున పూల, తులసి తోటలను పెంచడానికి అవకాశముంది. అలాగే పురాతన తితి దేవస్థానం వెనుకభాగాన ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ నీటి వసతులు కూడా ఉన్నాయి. దీనిపై ఈవో శ్రీనివాస్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా.. గతంలో పూల వనానికి సంబంధించి మరోమారు ప్రతిపాదించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బల్దియాకు రూ.4 కోట్లు విడుదల

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పురపాలక సంఘంలో అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించి రూ.4 కోట్లు ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. జరిగిన పనులకు సంబంధించి 15 నెలలుగా గుత్తేదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తేవడంతో నిధులు విడుదలయ్యాయి. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను దసరా సందర్భంగా విడుదల చేయించడం అభినందనీయమని జిల్లా గుత్తేదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగిలి క్రిష్టానందరెడ్డి పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన ర్యాలీ

జగిత్యాల, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ నియామకాలు చేపడుతున్నారని ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చెట్‌పల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్షలో అభివాదం చేస్తున్న బీసీ ఐకాస నాయకులు

బీసీల హక్కుల సాధనకు నిరంతర ఉద్యమం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: బీసీల హక్కులు సాధించుకునే వరకు నిరంతరం ఉద్యమం కొనసాగిస్తామని తెలంగాణ బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ పేర్కొన్నారు. బీసీ కుల గణన చేపట్టాలని, చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లిలో బుధవారం బీసీ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు రాష్ట్రమంతా బీసీ ఐకాసలు ఏర్పాటు చేసి ఉద్యమాలు చేస్తామన్నారు. బీసీ ఐకాస కోరుట్ల నియోజకవర్గ ఛైర్మన్ పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేసి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఐకాస కన్వీనర్, మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం చేసే వరకు ఉద్యమిస్తామని చెప్పారు. వివిధ ప్రాంతాల బీసీ వర్గాలు దీక్షలో పాల్గొనగా, రాజారామ్ యాదవ్ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. తుల రాజేందర్, చెన్న విశ్వనాథం, కొక్కు పురుషోత్తం, కంఠం భారతి, ఎర్రోల్ల నర్సు, ఆకుల శ్రీనివాస్, పుల్ల జగన్‌గౌడ్, గురిజెల రాజరెడ్డి, ప్రసాద్, రాంబాబు, గంగాధర్, నవీన్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

అందని సీడీపీ నిధులు.. సాగని పనులు

ఈ ఏడాదిలో విడుదల ఊసే లేదు

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లాకు ఈ వార్షిక సంవత్సరం (2024-25)లో రావాల్సిన నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధుల ఊసే లేదు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలు.. చేపట్టాల్సిన ప్రగతి పనుల విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. గతేడాది నవంబరులో జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు తోడుగా.. కొత్త పనుల కోసం వెచ్చించాల్సిన నిధులు ఇంకా రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పెరుగుతున్నాయి. గ్రామాలు, పట్టణాల నుంచి ఎమ్మెల్యేలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించి దండిగా ప్రతిపాదనలు అందుతున్నాయి. ఇటీవల వరదల కారణంగా చాలాచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వాటికి సంబంధించిన ప్రతిపాదనలకు కూడా ప్రత్యేక ప్యాకేజీ రాకపోవడంతో కళ్లముందు కనిపిస్తున్న పనులకు నిధులను ఏ విధంగా సమకూర్చాలనేది అటు అధికారులకు.. ఇటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు సమస్యగా మారింది.

రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండింతలు..

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌డీపీ) నిధి పేరిట ప్రతి శాసనసభ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. దీనికి అదనంగా సీడీపీ నిధులు కూడా అందితే ఎమ్మెల్యేలకు వచ్చే వినతులకు మోక్షం లభించేది. నియోజకవర్గ అభివృద్ధి నిధి ద్వారా ప్రస్తుతం రూ.5కోట్ల చొప్పున రావాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.50 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. తరువాత కొన్నాళ్లకు రూ.75 లక్షలు ఆ తరువాత రూ.కోటి యాభై లక్షలకు పెంచారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రెండింతలు చేశారు. 2018 నుంచి రూ.5 కోట్లను అందిస్తూ వస్తున్నారు.



కోనాపూర్‌లో అసంపూర్తిగా భవన నిర్మాణం

రూ.120 కోట్లపైనే ఆశలు..

గతేడాది నవంబరులో ఎన్నికలు జరగడం డిసెంబరులో కొత్త ప్రభుత్వం ఏర్పాటవడంతో ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ఈ ప్రత్యేక అభివృద్ధి నిధిని అన్ని నియోజకవర్గాలకు కేటాయించారు. ఇలా 12 నియోజకవర్గాలకు రూ.10కోట్ల చొప్పున వచ్చిన రూ.120 కోట్లను వినియోగించడంపైనే ప్రస్తుతం అందరూ దృష్టి సారిస్తున్నారు. వీటిని పాత పనులకు పెట్టకూడదనే నిబంధనను అమలు చేస్తున్నారు. ఇందులో నుంచి తాగునీటికి రూ.కోటి, బడుల్లో మౌలిక వసతుల కోసం రూ.2 కోట్లు ప్రతి ఎమ్మెల్యే ఖర్చు చేయాలి. అంతేకాకుండా కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనలతో ప్రభుత్వ భవనాల మరమ్మతులకు రూ.50 లక్షలు విధిగా కేటాయించాలి. మిగిలిన రూ.6.5 కోట్లను ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలి.

అన్నింటికీ ఎస్‌డీపీ నిధులే ఆధారం..

12 నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఈ ఏడాదిలోనే 1500కు పైగా ప్రతిపాదనలు అందినట్లు అధికారులు చెబుతున్నారు. వీటన్నింటికి ఎస్‌డీపీ నిధులే ఆధారమవుతున్నాయి. ప్రతి పనికి ఇన్‌ఛార్జి మంత్రి అనుమతితోనే నిధులు విడుదల చేయాల్సి ఉండటంతో ఇబ్బంది ఏర్పడుతోంది. పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో అందిన ప్రతిపాదనలకు ఎమ్మెల్యేలు న్యాయం చేయలేకపోతున్నారు. మరోవైపు కార్యాలయాలకు వచ్చిన ప్రతిపాదనల్లో వేటికి ప్రాధాన్యత నివ్వాలనేది యంత్రాంగానికి తలనొప్పిగా మారుతోంది.

డీఎస్సీలో మెరిశారు

కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే టీచర్ ఉద్యోగాలు

న్యూస్‌టుడే, మల్యాల

ఓవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. మరోవైపు డీఎస్సీకి సన్నద్ధమై లక్ష్యాన్ని సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. మల్యాల మండలం తక్కళ్లపల్లి, మల్యాల గ్రామాలకు చెందిన ముగ్గురు మహిళలు డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగం సాధించి బుధవారం హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

కుట్టు పనిచేస్తూనే..



తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బేతి మమత డీఈడీ పూర్తి చేసి జీవనోపాధి కోసం ఇంట్లో కుట్టు పనిచేస్తుంటారు. మమత భర్త గణేష్ మల్యాలలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ భార్యాపిల్లలను పోషిస్తున్నారు. డీఎస్సీకి సొంతంగా సన్నద్ధమై జిల్లా స్థాయిలో 35వ ర్యాంకు సాధించి ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు.

జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు



తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన జుట్టు లావణ్య జగిత్యాలలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలోనే తల్లిదండ్రులు వివాహం చేశారు. హైదరాబాద్‌లో బీఈడీ పూర్తి చేసిన లావణ్య డీఎస్సీలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించి బయాలజీలో స్కూల్ అసిస్టెంటుగా ఉద్యోగం పొందారు. భర్త అజయ్ కరీంనగర్‌లో ఆసుపత్రిలో పనిచేస్తుంటారు. ఆన్‌లైన్ క్లాసులు వినుకుంటూ సొంతంగా సన్నద్ధమై ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

గురుకుల టీజీటీ నుంచి..



మల్యాలకు చెందిన గుడిసె సౌజన్య ఆరు నెలల కిందట గురుకుల టీజీటీ ఉద్యోగం పొంది రెండు నెలలుగా నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్నారు. తాజాగా డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంటుగా ఎంపికయ్యారు. బీఎస్సీ, బీఈడీ చదివిన సౌజన్య ఇద్దరు పిల్లలతో ఇంటి వద్దే ఉంటూ ఏడాదిపాటు సొంతంగా సన్నద్ధమై డీఎస్సీలో జిల్లా స్థాయి 32వ ర్యాంకు సాధించారు. భర్త కార్తీక్ హైదరాబాద్‌లో ఎస్‌బీఐలో అకౌంటెంటుగా పనిచేస్తున్నారు.

ప్రశాంత జీవనం అవగాహనే ప్రధానం 15లో

గరుడ వాహనంపై శ్రీవారు



కోరుట్ల పట్టణంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గరుడ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై నెలకొల్పి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. – న్యూస్‌టుడే, కోరుట్ల

సరస్వతీ అలంకరణ



దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు మూల నక్షత్రం సందర్భంగా బుధవారం సరస్వతీ రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. నవదుర్గా సేవాసమితి, జయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం సరస్వతీ రూపంలో అలకరించి విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అష్టలక్ష్మి ఆవరణలో కనకదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీమాన్ నంబి వేణుగోపాలచారి అక్షరాభ్యాసం నిర్వహించారు. – న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

అమ్మవారికి బోనాలు

పట్టణంలోని శ్రీ నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మహిళలు సామూహికంగా బోనాలు సమర్పించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీదేవస్థానం నుంచి శోభాయాత్రగా బయలుదేరారు. చిన్నారులు దేవీ, శంకరుల వేషాలను ప్రదర్శించగా.. డప్పు చప్పులతో మండపానికి చేరుకున్నారు. – **న్యూస్‌టుడే, ధర్మపురి**





ఒక్కేసి పువ్వేసి చందమామ..

జగిత్యాల పాతబస్టాండు ప్రాంగణంలో బుధవారం రాత్రి జగిత్యాల పురపాలిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. 18 అడుగుల ఎత్తయిన బతుకమ్మను పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా మహా బతుకమ్మ శోభయాత్ర నిర్వహించారు. పురపాలిక కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చింతకుంట చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పురపాలిక అధ్యక్షురాలు జ్యోతి, కమిషనర్ సమ్మయ్య, ఉపాధ్యక్షుడు గోలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. – **న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం**

కోతులు.. ఎలుకలు.. పందులు

తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

న్యూస్‌టుడే, సారంగాపూర్

అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే వరకు కంటి మీద కునుకు లేకుండా కాపాడుకోవాల్సి వస్తోంది. కోతులు, ఎలుకలు, పందులు వివిధ రకాల జంతువులు పంటలను తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. కొంత కాలంగా కోతులు, పందుల బెడదతో తీవ్రంగా నష్టపోతున్న రైతులకు ఈ ఏడాది ఎలుకలు ఇబ్బందికరంగా మారాయి. ప్రస్తుతం వరిపంట చేతికందే సమయంలో అడవి పందులు మరింత నష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి. జిల్లాలో దాదాపు 59,735 హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉండగా ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో అటవీ జంతువులు పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్ మండలాల పరిధిలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉండడంతో మరింత ఇబ్బందిగా మారుతోంది. పంటలను కాపాడుకునేందుకు ప్రమాదమని తెలిసినా అక్కడక్కడ రైతులు విద్యుత్తు కంచెలను ఏర్పాటు చేయక తప్పడంలేదు. దీనివల్ల అనేక మంది రైతులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి.

ప్రకటనలకే పరిమితం!

అటవీ జంతువులు పంటలను ధ్వంసం చేస్తే నష్టంపై పరిహారం అందించే విషయంలో ప్రకటనలకే పరిమితమవుతోంది. పరిహారం అందించే విషయంలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అడవి పందుల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే రెండు రోజుల్లో సంబంధిత అటవీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే వ్యవసాయ, రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి పంట నష్టాన్ని పరిశీలించి నివేదిక తయారు చేస్తారు. పంట నష్టంపై మూడు శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో అది సాధ్యపడడంలేదు. ప్రస్తుతం సౌరశక్తితో పనిచేసే సోలార్ కంచెలు అందుబాటులోకి వచ్చాయి. వాటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తే పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.



అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

మైకుతో కాపలా.. - గడ్డం జలేందర్‌రెడ్డి, సారంగాపూర్



పంటలను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోజంతా కోతులు, ఎలుకలతో రాత్రయితే అడవి పందులు పంటలను తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. రాత్రివేళలో మైక్ పట్టుకొని పొలం చుట్టూ కాపలా ఉండాల్సి వస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంప్

? మా ప్రాంతంలో నల్లానీరు రావటంలేదు. - శ్రీనాథ్, భవానీనగర్
✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాము. - సమ్మయ్య, పురపాలక కమిషనర్, జగిత్యాల

న్యూస్‌టుడే, మల్యాల

? మల్యాల మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం విద్యుత్ సరఫరాకు పలుమార్లు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. - మల్యాల, ముత్యంపేట గ్రామస్థులు
✓ కొండగట్టు ప్రాంతంలోని ఉపకేంద్రంలో ఏబీ స్విచ్ ఏర్పాటుచేసే సమయంలో రెండు మూడు రోజులపాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. - శ్రీనివాస్, విద్యుత్ ఏఈ మల్యాల

అక్రమ లేఅవుట్‌లో భవన నిర్మాణ అనుమతులు రద్దు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం అప్పారావుపేట గ్రామంలోని అక్రమ లేఅవుట్‌లో 16 భవన నిర్మాణాల కోసం పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. గ్రామ శివారులో గ్రామపంచాయతీ, డీటీసీపీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఎలాంటి ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వరాదని, మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పదిహేను రోజుల్లో పత్రాలను పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా అభ్యంతరాలపై ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కేవలం రెండు, మూడు రోజుల్లోనే అనుమతులిచ్చారని పేర్కొన్నారు. దీంతో గ్రామపంచాయతీకి రావాల్సిన సంపద, అభివృద్ధి నిధులు నిర్వీర్యం చేశారన్నారు. అక్రమ భవన నిర్మాణ అనుమతులిచ్చిన పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లను ఇటీవల విధుల నుంచి సస్పెండ్ చేయగా బుధవారం కార్యదర్శి మంజూరు చేసిన 16 భవన నిర్మాణ అనుమతులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా సంబంధిత ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడంతో పాటు అక్రమ నిర్మాణాలు జరిగితే అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని ఉత్వర్తుల్లో పేర్కొన్నట్లు ఎంపీడీవో తెలియజేశారు.

బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలో గురువారం నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల కోసం మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ సంబరాలకు పురపాలక సంఘం నుంచి రూ.5 లక్షల ప్రత్యేక నిధులను కేటాయించారు. సంజీవయ్య కాలనీ వద్దనున్న పుల్‌వాగు, రామాలయం, కంచరకుంట, మాదాపూర్ కాలనీలోని వాగులో నీటి నిల్వ కోసం జేసీబీతో పూడికను తొలగించారు. వాగు ఆవరణలో రక్షణగా మున్సిపల్ ఉద్యోగులను, సిబ్బందిని కేటాయించినట్లు కమిషనర్ తిరుపతి తెలిపారు. బతుకమ్మ ఏర్పాట్లను ఏఈలు అరుణ్‌కుమార్, లక్ష్మి దగ్గరుండి పర్యవేక్షించారు.

మేడిపల్లి: వేములవాడ నియోజకవర్గంలో సద్దుల బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం మేడిపల్లి, భీమారం మండలాల్లో ఆయన పర్యటించారు. మేడిపల్లిలో బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించి దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దమ్మన్నపేట గ్రామంలోని నవదుర్గా సేవాసమితి, భీమారం మండలం గోవిందారంలో కనకదుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోని దుర్గామాత విగ్రహాల వద్ద పూజల్లో పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం కొలువుదీరింది. మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మన్‌గా అంతడుపుల పుష్పలత, వైస్‌ఛైర్మన్‌గా ఇట్టేడి నారాయణరెడ్డితో పాటు డైరెక్టర్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు.

ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి

బుగ్గారం, న్యూస్‌టుడే: ప్రజల ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం బుగ్గారం పోలీస్ ఠాణాను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. బ్లూకోర్ట్, పెట్రో కారు నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలన్నారు. దసరా ప్రశాంత వాతావరణంలో జరిగేలా భద్రతపరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా సుందరగిరి శ్యాంసుందర్, S/o. వెంకటయ్య, వృత్తి: వ్యాపారం, ఇం.నెం. 4-2-119/8/30, హౌజింగ్ బోర్డు కాలనీ, ధరూర్ క్యాంప్, జగిత్యాల టౌన్ మరియు జిల్లా. నా స్వంత గృహము హౌజింగ్ బోర్డు ధరూర్ క్యాంప్, జగిత్యాల గల [illegible] FIR 286/2021 [illegible] SRO [illegible] 4886/2013 [illegible] 28-10-2013 [illegible]

తేది: 9-10-2024 [illegible] B.A., LL.B., న్యాయవాది [illegible] సెల్: 94413 56313

స్వదేశానికి రప్పించాలని ఎమ్మెల్సీకి వినతి

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఏజెంట్ చేతిలో మోసపోయి, నరక యాతన అనుభవిస్తున్న తన కుమారుడిని స్వదేశానికి తీసుకువచ్చేలా చొరవ చూపాలంటూ తల్లిదండ్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వేడుకున్నారు. సారంగాపూర్‌కు చెందిన పప్పుల అజయ్‌ను ఏజెంట్ మోసం చేశాడని, ప్రస్తుతం పనులు లేక పస్తులుంటున్నాడని, పాస్‌పోర్టు లేకపోవటంతో స్వదేశానికి వచ్చే వీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీఎం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత [illegible] హామీ ఇచ్చారు. రాంచందర్ రెడ్డి, మధుసూదన్, గంగయ్య, సతీష్, రాజయ్య ఉన్నారు.


కోరుట్లలో పూజల్లో మహిళలు


కోరుట్ల: కాళరాత్రి అవతారంలో..


మెట్‌పల్లి పట్టణం: బోనాలతో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గా మంటపాల్లో బుధవారం అమ్మవారు కాళరాత్రి, శాకంబరి, సరస్వతీమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. - న్యూస్‌టుడే యంత్రాంగం


మెట్‌పల్లి పట్టణంలో..


కొడిమ్యాలలో..

కుంకుమార్చనలు.. అక్షరాభ్యాసాలు


మెట్‌పల్లి: జగ్గాసాగర్‌లో..


మల్యాల: నూకపల్లిలో..


రాయికల్: మైతాపూర్ ఆలయంలో..


కథలాపూర్: గంభీర్‌పూర్‌లో..


సారంగాపూర్: గజవాహనంపై స్వామివారి ఊరేగింపు

కాటమయ్య కిట్ల పంపిణీ


యూసుఫ్‌నగర్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.సంజయ్

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్ గ్రామంలో బుధవారం గీత కార్మికులకు కాటమయ్య కిట్లను ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. కిట్లు గీత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అబ్కారీశాఖ అధికారులు, గీత కార్మిక సంఘ, భాజపా నాయకులు పాల్గొన్నారు.

తరగతి గదుల మరమ్మతులకు వినతి

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వ జూనియర్(బాలుర) కళాశాలలోని సైన్స్‌ల్యాబ్ గదుల పైకప్పులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలంటూ బుధవారం ఎమ్మెల్యే డా.సంజయ్‌కు ప్రిన్సిపల్ గౌసూర్ రహమాన్, అధ్యాపకులు వినతి పత్రం సమర్పించారు. త్వరలోనే నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. నటరాజన్, ఇమ్రాన్‌ఖాన్, సంజీవ్‌కుమార్, జయదేవ్, మోహిద్ తదితరులు పాల్గొన్నారు.

మేజిస్ట్రేట్ ఆదేశాలతో యువతి అప్పగింత

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లికి చెందిన ఓ ప్రేమ జంట గత నెల 29న పెళ్లి చేసుకోగా మేజిస్ట్రేట్ ఆదేశాలతో పోలీసులు బుధవారం అబ్బాయి తల్లిదండ్రులకు అమ్మాయిని అప్పగించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఓ యువకుడు, యువతి ప్రేమ వివాహం చేసుకోగా యువతి తల్లిదండ్రులు మెట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు యువతిని జగిత్యాల సఖీ కేంద్రానికి తరలించారు. యువతి మేజర్ కావడంతో అప్పగించాలని యువకుడి తల్లిదండ్రులు పోలీసులను కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం యువతిని మెట్‌పల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఆయన వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం మేజిస్ట్రేట్ ఆదేశాలతో యువతిని యువకుడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన దృశ్యం

ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల సందర్భంగా తమ కాలనీకి దేవుడి ఊరేగింపు(శవ) తీసుకురావాలని కోరుతూ మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన ఎస్సీ సంఘాలు బుధవారం సాయంత్రం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. వీడీసీ సభ్యులు అడ్డుకుంటున్నారని, న్యాయం చేయాలని కోరారు. నాలుగైదు రోజులుగా దీనిపై వివాదం నడుస్తుండగా ఉదయం ఆర్డీవో శ్రీనివాస్, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవి గ్రామానికి వెళ్లి కుల సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ కాలనీకి ఊరేగింపు తీసుకెళ్లాలని వారికి అధికారులు నచ్చజెప్పారు. సాయంత్రం ఎస్సీ సంఘాలు ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించడంతో ఆర్డీవో, సీఐలు మరోమారు వీడీసీ పెద్దలతో మాట్లాడి ఎస్సీ కాలనీకి ఊరేగింపు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఎస్సీ కాలనీకి దేవుడి ఊరేగింపు వస్తుందని అధికారులు ప్రకటించడంతో ఎస్సీ సంఘాలు ఆందోళన విరమించారు. అనంతరం రాత్రి ఎస్సీ కాలనీలో దేవుడి ఊరేగింపు జరగడంతో వివాదం సద్దుమణిగినట్లయింది.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

కోరుట్ల, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలంటూ బుధవారం కోరుట్ల పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహాదేవ ధర్మ పీఠాధిపతి సద్గురు మహాదేవ్, ఎమ్మెల్యే డా.సంజయ్ ర్యాలీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వార్థం లేకుండా మంచి మనిషిగా జీవించడాన్ని మన సనాతన ధర్మం బోధిస్తుందన్నారు. గాంధీరోడ్ మీదుగా, ప్రధాన రహదారి, అంబేడ్కర్ సర్కిల్, నందిచౌక్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

హైదరాబాద్ తరలిన డీఎస్సీ అభ్యర్థులు

జగిత్యాల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులుగా ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులు నియామకపత్రాలు పొందేందుకు బుధవారం హైదరాబాద్ తరలి వెళ్లారు. 269 మంది అభ్యర్థులను 7 బస్సుల్లో అధికారులు హైదరాబాద్ పంపించారు. జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు కలెక్టరేట్‌లో బస్సుల జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు, జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బోనగిరి నరేష్, బీసీ, ఎస్సీ అభివృద్ధి అధికారులు ఎల్.సాయిబాబా, కె.రాజ్‌కుమార్ తదితరులున్నారు.

'గల్ఫ్ చేసిన మేలు' ఆల్బమ్ విడుదల

భీమారం : భీమారం మండలం రాజలింగంపేటకు చెందిన కోరెపు మల్లేశ్ రాసిన 'గల్ఫ్ చేసిన మేలు' పాటల ఆల్బమ్‌ను ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ దుబాయిలో విడుదల చేశారు. తన పాటలకు సంగీతం సమకూర్చడమే కాకుండా స్వయంగా ఆలపించిన వందేమాతరం శ్రీనివాస్‌కు మల్లేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

జగిత్యాల, న్యూస్‌టుడే: మానసిక ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరని నిపుణులు అన్నారు. బుధవారం జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ పి.కిషన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్యంపై ప్రతులను ఆవిష్కరించారు. ఆషామౌనిక, డాక్టర్ సాకేత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు


కోరుట్ల: బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు, ఐకేపీ సిబ్బంది


రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో..

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండల పరిషత్ ఆవరణలో పంచాయతీరాజ్, ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, ఐకేపీ మహిళలు పూలతో భారీ బతుకమ్మను పేర్చారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఏపీవో మమత, ఏపీఎం శంకర్, కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్ పట్టణం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షిప్తం

భాజపా సభ్యత్వ నమోదు

కోరుట్ల: కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం చేపట్టారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి పలువురితో సభ్యత్వం చేయించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మహిళా సంఘ సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోరిగం రాజు, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన జలజ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణం తీసుకుని ఏర్పాటు చేసిన పెరటి కోళ్ల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు.

పర్వతారోహణలో ఆలూరు విద్యార్థులు

రాయికల్: రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన లక్కం మణిరాజ్, రిషిత అన్నా చెల్లెల్లు కరీంనగర్ చైతన్య అకాడమీలో చదువుతున్నారు. ఈనెల 8న మనాలీలోని 14,600 అడుగుల పర్వతాన్ని పాఠశాల విద్యార్థుల బృందం అధిరోహించింది. ఈ బృందంలో ఆలూరు విద్యార్థులు భాగస్వామ్యులు కావడంతో గ్రామస్థులు అభినందించారు.

కాన్షీరాం వర్ధంతి

జగిత్యాల: జగిత్యాలలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ దుబ్బాక శివ, అరుణ్, కిషోర్, గంగరాజం, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

సంఘాలు-నియామకాలు

సారంగాపూర్: పీఆర్టీయూటీఎస్ అసోసియేట్ అధ్యక్షులుగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు చెందిన పలువురిని నియమించినట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్‌రావు, అమర్‌నాథ్‌రెడ్డిలు తెలిపారు. అసోసియేట్ అధ్యక్షులుగా గోవర్ధన ప్రసాద్, కొలిచాల సత్యరాజ్, వి.భాస్కర్‌రెడ్డి, బొమ్మకంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శిగా జూపల్లి సుదర్శన్‌ను నియమించినట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

కొడిమ్యాల: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన దండుగుల రాజం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పార్టీ సభ్యత్వానికి సంబంధించి రూ.2 లక్షల బీమా మంజూరవగా చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు.

పుర వీధుల్లో నారసింహుడి సేవ

ధర్మపురి: శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి శ్రీ నారసింహుడి గరుత్మంత వాహన సేవ నిర్వహించారు. ముందుగా దేవస్థానంలో పూజలు చేసి, గరుత్మంత వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

విస్తృత ఏర్పాట్లు చేయాలి

ధర్మపురి : సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని విప్ లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం గోదావరి తీర ప్రదేశం, జంబిగద్దె తదితర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్ష చేశారు. పుర అధ్యక్షురాలు సత్తెమ్మ, తహసీల్దార్ కృష్ణ చైతన్య, పుర కమిషనర్ గంగాధర్, ఎస్సై గంగుల మహేష్ పాల్గొన్నారు.

ధర్మపురి గ్రామీణం: జైన, మగ్గిడి, దొంతాపూర్ గ్రామాల మధ్య అర్అండ్‌బీ రహదారికి బుధవారం మరమ్మతులు చేపట్టారు. రహదారి శిథిలమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు ఇటీవల విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మరమ్మతులు చేపట్టాలని అర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సమస్యను త్వరగా పరిష్కరించిన లక్ష్మణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జగిత్యాల ధరూర్‌క్యాంపు: కేరళలోని తిరువనంతపురం అనంతపద్మనాభస్వామి ఆలయంలో జరిగిన విజయదశమి బ్రహ్మోత్సవాల్లో జగిత్యాలలోని మేదిలి లలితా కళాక్షేత్రానికి చెందిన 12 మంది విద్యార్థినులు భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. బొమ్మిడి నరేశ్‌కుమార్, మేదిని భుజంగరావును అధికారులు జ్ఞాపికలతో సత్కరించారు.

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జగిత్యాల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా ఇటీవల నియమితులైన డాక్టర్ ఎస్.ఎల్.మనోహర్ ఉపసంచాలకుడిగా పదోన్నతి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఏడీలు నరేశ్, బక్కయ్య, నాన్‌గెడిటెడ్ అధికారుల జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్, వెటర్నరీ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సునీల్, అశోక్‌కుమాం సన్మానించారు.

వరద కాలువ మట్టి తరలింపుపై ఫిర్యాదు

మల్యాల: మల్యాల మండలంలోని వరద కాలువ నుంచి నిత్యం అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జగిత్యాల జల్లా మాదిగ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేష్ బుధవారం మల్యాల తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వరద కాలువ డీఈ తిరుపతిని వివరణ కోరగా బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలో చిన్న చిన్న మరమ్మతుల కోసం జగిత్యాల మున్సిపల్ అధికారులు వరద కాలువ నుంచి మట్టి రవాణాకు అనుమతి పొందిట్లు వివరించారు. మల్యాల మండల ప్రజల అవసరాల కోసం వరద కాలువ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

బోరు ఉన్నా... దాహార్తి తీరే దారేది!?



వెల్గటూరు, న్యూస్‌టుడే: ఎండపల్లి మండలం గుల్లకోటలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. పద్మశాలివాడకు చెందిన సుమారు 15-20 కుటుంబాలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో ఇటీవల ప్రత్యేకంగా బోరు ఏర్పాటు చేశారు. అయితే కనెక్షన్ లేకపోవడంతో అలంకార ప్రాయంగా మారింది. దీనిపై పంచాయితీ కార్యదర్శి తిరుపతిరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. మధ్యలో సుమారు 5-6 మీటర్ల పొడవునా పైపు లైను నిర్మాణం అవసరం ఉందన్నారు. త్వరలో పరిష్కరిస్తామన్నారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

మల్లాపూర్, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెంది మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన నల్ల లక్ష్మి(60) అనే మహిళ గ్రామ సమీపంలోని మంచినీటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. లక్ష్మికి ఇద్దరూ కూతుర్లు ఉండగా పెద్ద అల్లుడిని ఇల్లరికం, చిన్న కుమార్తెకు భర్త విడాకులు ఇవ్వడంతో ఆమె వద్ద ఉంటుంది. మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. పెద్ద కూతురు గంగజల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన అబ్రార్‌అలీ ఆటోలో తరలిస్తున్న 24 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. జగ్గాసాగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మహారాష్ట్రలోని ఉమ్రికి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. బియ్యంతో పాటు ఆటో, చరవాణిని సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మల్యాల : మల్యాల నుంచి తాటిపల్లి వెళ్లే రహదారి మధ్యలో మొండికుంట ఒర్రె వంతెనపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. తాటిపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ తన ద్విచక్రవాహనంపై మల్యాలకు వెళ్తున్నారు. రిషిత అనే మహిళ మొండికుంట ఒర్రె వంతెనపై తన స్కూటీని పక్కకు నిలిపి చరవాణిలో మాట్లాడుతుండగా వేగంగా వచ్చిన రాజ్‌కుమార్ స్కూటీని ఢీకొనడంతో ఆయన తలకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి స్థానికులు తెలిపారు. ఈ సంఘటనలో రిషితకు స్వల్ప గాయాలైనట్లు వివరించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి..

మల్యాల: ముత్యంపేట శివారులోని తుమ్మ చెరువు సమీపంలో బుధవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్ అనే యువకుడితో పాటు కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన యువకుడు గాయపడ్డట్లు స్థానికులు తెలిపారు.

యువకుడిపై పిచ్చికుక్క దాడి

జగిత్యాల: సుతారిపేటలో బుధవారం ఓ యువకుడిపై పిచ్చి కుక్క దాడి చేసింది. అజీజ్‌ఖాన్ అనే యువకుడు నడిచి వెళ్తుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

భూవివాదంలో రెండు కుటుంబాల ఘర్షణ

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్‌లో బుధవారం రాత్రి రెండు కుటుంబాలు ఘర్షణకు దిగాయి. గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మారెడ్డి, మానస మధ్య వ్యవసాయ భూమి విషయంలో గొడవ జరగగా జగిత్యాల రూరల్ పోలీసులకు మానస ఫిర్యాదు చేయగా లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

వన్యప్రాణిని తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

ధర్మపురి గ్రామీణం: వేటాడిన ముళ్లపందిని ద్విచక్రవాహనంపై తరలిస్తున్న నేరెల్లకు చెందిన తీగల గౌరయ్యను బుధవారం ఆ శాఖాధికారులు రిమాండ్‌కు తరలించినట్లు ధర్మపురి అటవీ క్షేత్రాధికారి శ్రీనాథ్ తెలిపారు. బుధవారం నేరెల్ల అటవీ ప్రాంతంలో అధికారులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న గౌరయ్యను ఆపి వాహనాన్ని తనిఖీ చేశారు. కేసు నమోదుచేసి విచారణ నిర్వహిస్తున్నట్లు క్షేత్రాధికారి తెలిపారు.

సాహితీ విరులు.. సాంస్కృతిక సిరులు

- బతుకమ్మ పాటల్లో ప్రాచీన సౌందర్యం
- భావి తరాలకు అందిస్తున్న అక్షర శ్రామికులు



బతుకమ్మ పుస్తకాలు

అతివలు ఆనందంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ సాంస్కృతిక వారధిగా నిలుస్తోంది.. పూజలకు వినియోగించే పూలనే కొలిచే వేడుక జానపదుల జీవన సౌందర్యానికి అద్దం పడుతోంది.. ఆచార వ్యవహారాలు, పల్లె వాసుల కష్టాలను ప్రతిబింబించేలా అలతి పదాలతో మహిళల నోటి నుంచి జాలువారే పాటలు నేటి తరానికి ప్రాచీన సంప్రదాయాలను అందిస్తున్నాయి.. శతాబ్దాల కిందటి చరిత్రను నేటి తరాలకు అందించడం వెనుక ఎంతో మంది గాయనీమణులతో పాటు సాహితీవేత్తల కృషి దాగి ఉంది..

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

మారుతున్న కాలంతో పాటే పండుగ నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చినా బతుకమ్మ పాటల్లో ఒకే రకమైన సాహిత్యం, రాగం శతాబ్దాలుగా పడతుల నోళ్లలో నానుతోంది. ఎంగిలిపూలతో ఆరంభమై సద్దులతో ముగిసే వేడుకను రోజుకో పేరుతో ఆడుకోవడం తెలంగాణకే ప్రత్యేకంగా నిలిచింది. వందల ఏళ్ల కిందట పుట్టిన గీతాలు వారసత్వ సంపదగా వస్తున్నాయి.

ప్రకృతి ఆరాధన

■ బతుకమ్మ పాట ఆరంభంలో పంచ భూతాలను తలచుకోవడం ప్రకృతి ఆరాధనకు అద్దం పడుతుంది.

■ సూర్యచంద్రులు, భూమి, గంగ, ఇష్ట దేవతలు, కుల దైవాలు, ఇలవేల్పుల పాటల్లో స్తుతి కనిపిస్తుంది. ఇది ప్రాంతాన్ని బట్టి మారుతుంది. మన ప్రాంతంలో వేములవాడ రాజన్న, కొమురవెల్లి మల్లన్న, రాముడిని, కృష్ణుడిని తలచుకుంటూ పాడుకుంటారు.

■ పండుగ పుట్టు పూర్వోత్తరాలను తెలిపే అంశాలను అనాదిగా బతుకమ్మ పాటలుగా అల్లుకున్నారు.

■ లక్ష్మీదేవిని, పార్వతీదేవిని పేరంటాలుగా, ప్రకృతికి రూపంగా భావిస్తూ పాటల్లో వల్లె వేస్తారు.

పుట్టుకపై భిన్న కథలు

క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన భట్టు నరసింహ కవి రాసిన 'శ్రీలక్ష్మి దేవి ఉయ్యాలో.. సృష్టి బతుకమ్మయ్యే ఉయ్యాలో..' అంటూ సాగే పాట రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రాచుర్యంలో ఉంది. ఈ పాటలోనే బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాలు వివరించారు. చోళ దేశ రాజు ధర్మాంగుడు, సత్యవతి దంపతులు శత్రువుల చేతిలో వంద మంది కుమారులను పోగొట్టుకోగా శ్రీలక్ష్మీదేవి అనుగ్రహించి సత్యవతి కడుపున తానే కూతురుగా జన్మిస్తుంది. ఆ శిశువును చూసి దేవతలు, మునులు చల్లగా బతకమంటూ 'బతుకమ్మ' అని దీవిస్తారు. శ్రీమహావిష్ణువు చక్రాంగుడనే పేరుతో జన్మించి రాజు వేషంలో వచ్చి బతుకమ్మను పెళ్లి చేసుకొని సిరిసంపదలతో, సంతానంతో సుఖంగా ఉన్నారనే కథ ప్రచారంలో ఉంది.

■ మరో కథలో గౌరీదేవి మహిషాసురుడిని వధించాక అలసి అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు సొమ్మసిల్లి పడిపోతుంది. ఆమెను స్పృహలోకి తేవడానికి మహిళలందరూ దేవిని బతుకమ్మ అని ప్రార్థిస్తూ పాటల రూపంలో వేడుకోగా దశమి రోజున తేరుకుంటుంది. నాటి నుంచి ఆమెను బతికిన అమ్మ, బతుకమ్మగా కొలుస్తున్నారని ప్రచారంలో ఉంది.


ఇక్కడి ఆడపిల్లల సొత్తు



భారతీయ సంస్కృతిలో మహిళకు అత్యంత గౌరవ స్థానం ఉంది. ఇది మనకు పురాణాలు, గ్రంథాల ద్వారా నిరూపితమైంది. సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీపరమేశ్వరులు.. ఇలా స్త్రీ దేవతలతో కూడిన గీతాలను బతుకమ్మ పాటలుగా పాడుకుంటాం. నా చిన్నతనంలో విన్న మంచి పాటలు నేడు కనుమరుగయ్యాయి. సంస్కృతిని భావి తరాలకు అందించాలన్న ఉద్దేశంతో కొన్నింటిని సేకరించాను. ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్పులు చేసి పుస్తక రూపంలో తీసుకొచ్చా. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాలు తిరిగి బహుళ ప్రాచుర్యంలో ఉన్న వాటిని తీసుకున్నా. తెలంగాణ ప్రాంతంలో పుట్టిన ఆడబిడ్డల సొత్తు ఈ పాటలు.

– డా.అడువాల సుజాత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆకాంక్షను ఇనుమడింపజేసేలా..



బతుకమ్మ పాటల స్ఫూర్తితో సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంపై బతుకమ్మ పాట రాశాను. ఇందులో రాష్ట్ర భౌగోళిక పరిస్థితులు, జిల్లాల వారీగా వనరులు, ఇక్కడి ప్రజల సమస్యలను, ఆకాంక్షను వివరించా. అన్ని అంశాలను ఇనుమడింపజేసేలా పాటగా తీసుకొచ్చా. ఇందుకు నా భర్త లక్ష్మీనారాయణ సహకారం తీసుకున్నా.

– సబ్బని శారద, కరీంనగర్

మూడు జిల్లాల్లో సేకరించా..



వందల ఏళ్ల కిందటి బతుకమ్మ పాటలు అర్థవంతంగా ఉండేవి. బతుకమ్మ ఆట అతివలకు మంచి వ్యాయామం కూడా. నేను పౌరాణిక గీతాలు, పెళ్లి పాటలు, మంగళ హారతులు వంటి పాటలు రాశా. ఈ ప్రాంత మహిళలకు ఎంతో ఇష్టమైన బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగల సంస్కృతి బతికించడానికి పాటలు సేకరించా. కరీంనగర్, వరంగల్, నల్గొండ ప్రాంతాల్లో పని చేసినపుడు బతుకమ్మ పాటలు సేకరించి పుస్తకంగా తీసుకొచ్చా. అమెరికాలోని తెలుగువారు పండుగ వేళ ఎంతో ఇష్టంగా పాడుకుంటున్నారు. ఇప్పటి పిల్లలు డీజేలు, రికార్డింగ్ పాటలపై వేస్తున్న గెంతులు చూసి మా తరం వారికి బాధనిపిస్తోంది.

– డా.ఆర్.కమల, విశ్రాంత అధ్యాపకురాలు

ప్రశాంత జీవనం అవగాహనే ప్రధానం



నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం, రాయికల్

తరచూ అనవసర ఆందోళనలకు గురికావడం, ఒంటరిగా ఉండటం, మతిమరుపు ఇలాంటి అనేక సమస్యలు మానసిక అనారోగ్యం జాబితాలోనివే. శారీరకంగా ఎంత ఆరోగ్యకరంగా ఉన్నా.. మానసిక ప్రశాంతత లేకపోతే జీవనయానం గతి తప్పుతుంది. దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. ఇలా అనేక మానసిక సమస్యలు, నివారణపై అవగాహన కలిగించేందుకు ఏటా అక్టోబరు 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ 1992 నుంచి ఏటా ఒక్కో నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. 2024లో 'పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యం' నినాదంతో ముందుకొచ్చింది.

ప్రత్యేక వైద్య విభాగాలు..: మానసిక సమస్యలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య విభాగాలను ఏర్పాటు చేసి చికిత్సను అందుబాటులోకి తెచ్చారు. మద్యం, ధూమపానం, మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని సైతం వాటి నుంచి దూరంచేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఆయా విభాగాలు కృషి చేస్తున్నాయి.

■ గతేడాది నుంచి ఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం సేవలందిస్తుంది. సాధారణ సమస్యలతో వచ్చే వారికి ఓపీలోనే వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపిస్తుండగా.. తీవ్రత ఉన్న వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స చేస్తున్నారు.



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక వైద్య విభాగం

2024 మార్చి నుంచి ఖనిలో ఓపీ తీరు	నెల	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబర్
	ఓపీ	153	133	166	144	153	109	153

ఈ లక్షణాలుంటే..

■ **స్కిజోఫ్రీనియా:** వారిలో వారే మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, ఎదుటివారు తనకు హాని చేస్తారేమోననే అనుమానంతో ఆందోళనకు గురికావడం.

■ **కుంగుబాటు:** తమను తామే నిందించుకోవడం, చేస్తున్న పనిపై ఆసక్తి కనబరచకపోవడం, త్వరగా అలసిపోవడం, తమను తాము గాయపరుచుకోవడంతో పాటు ఆత్మహత్యలకు యత్నించడం.

■ **ఓసీడీ:** ఆబెస్సివ్ కంపల్సివ్ డిసార్డర్(ఓసీడీ) లక్షణాలున్నవారు చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. ఒకటే ఆలోచనను పదే పదే చెబుతుంటారు. ఉదాహరణకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తున్నా మళ్లీ వెనక్కి వచ్చి సరిచూసుకుంటారు.

■ **చిన్నపిల్లలు:** ప్రధానంగా చిన్నపిల్లలు అటెన్షన్ డెఫిషిట్ హైపరాక్టివిటీ డిసార్డర్(ఏడీహెచ్‌డీ), అటిజం తదితర మానసిక సమస్యలకు లోనవుతుంటారు. చదువుపై ఆసక్తి కనబరచకపోవడం, మిగతా పిల్లలతో కలవకుండా ఉండటం తదితర లక్షణాలు.

ముందస్తుగా గుర్తిస్తేనే నివారణ

మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తేనే ప్రాథమిక స్థాయిలో నివారించవచ్చు. వ్యక్తి ప్రవర్తనలో మార్పులను గమనించే కుటుంబ సభ్యులు వారికి చికిత్స ఇప్పించడంలో కీలకం. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగంలో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి తీవ్రంగా ఉన్నవారికి ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స చేస్తున్నాం.

- రవివర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్(మానసిక వైద్యం) ప్రభుత్వ వైద్య కళాశాల, ఖని

తమ్ముడిని చంపిన అన్న


చంద్రయ్య

శంకరపట్నం (సైదాపూర్), న్యూస్‌టుడే : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో దారుణం చోటు చేసుకుంది. అన్న చేతిలో తమ్ముడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుద్దెనపల్లికి చెందిన కుందేళ్ల ప్రేమలత- రాజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు కుమారస్వామి, చంద్రయ్య (31) ఉన్నారు. తండ్రి రాజయ్య ఉపాధి కోసం సుమారు అయిదేళ్ల కిందట దుబాయ్‌కు వెళ్లాడు. తల్లితోపాటు ఇద్దరు కుమారులు ఉంటున్నారు. కుమారస్వామి వివాహితుడు కాగా, చంద్రయ్యకు వివాహం కాలేదు. ఇద్దరు సొంత వ్యవసాయం చూసుకోవడంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తారు. అన్నదమ్ముళ్ల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి చంద్రయ్య మద్యం తాగి వచ్చి అన్న కుమారస్వామితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. వీరిద్దరిని ఆపేందుకు తల్లి ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆవేశంలో కుమారస్వామి అక్కడే ఉన్న ఇనుపరాడ్‌తో దాడి చేయగా చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొన్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, పట్టణ సీఐ తిర్మల్ గౌడ్, ఎస్సై తిరుపతి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే తమ్ముడిని హత్య చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రావుల శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

జగిత్యాల వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో రాగల నాలుగు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షసూచన ఉందని పొలాస పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. గాలిలోతేమ 59-94 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 22-23, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వాహనం


కొండగట్టు సమీపంలో బోల్తా పడ్డ వ్యాను

మల్యాల, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వ్యాను అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటన మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని కొండగట్టు ప్రాంతంలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వంటనూనె ప్యాకెట్ల లోడ్‌తో కామారెడ్డి నుంచి మంచిర్యాల వెళ్తున్న డీసీఎం వ్యాను కొండగట్టు ప్రాంతంలోని మారుతిటౌన్ షిప్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు నర్సింహులు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో దాదాపు గంటసేపు ఇబ్బంది పడ్డారు. మల్యాల ఎస్సై నరేష్, జగిత్యాల అగ్నిమాపక అధికారి కృష్ణకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌ను కత్తిరించి డ్రైవరును బయటకు తీసి చికిత్స కోసం 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మల్యాల పోలీసులు రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎల్ఎఫ్‌జి మధు, ఆపరేటర్ మల్లేశం, ఫైర్‌మ్యాన్లు వేణు, రాజేందర్ పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన స్వామివార్లు


ఉత్సవ మూర్తుల పెద్ద సేవలో అర్చకులు, భక్తులు: కాళరాత్రి అలంకారంలో అమ్మవారు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు కాలరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీరాజరాజేశ్వరిదేవికి చతుష్షష్టి పూజలను ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో గాయత్రి జపం, చండీ హోమం, గాయత్రి హవనాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణలతో జరిపించారు. మూల నక్షత్రం సందర్భంగా పుస్తక రూపిణి మహా సరస్వతి అమ్మవారికి, బాల త్రిపుర సుందరి దేవికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులకు వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టణంలోని ప్రధాన వీధుల్లో అశ్వవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై అమ్మాయిల ఆసక్తి

న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)


కర్రసాములో శిక్షణ పొందుతున్న బాలికలు

ప్రస్తుత సమాజంలో మహిళలపై నానాటికీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. బాలికలు, యువతులు, మహిళలు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునే వరకు కుటుంబీకులకు ఆందోళన తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరం. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు మహిళలు ఆత్మరక్షణ చర్యలు చేపట్టాలి. అందుకుగాను మార్షల్ ఆర్ట్స్ ప్రాధాన్యతను తెలియజేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం 'హర్ ఘర్ దుర్గా' పేరుతో నవరాత్రుల సమయంలో ఉచితంగా శిక్షణ అందిస్తోంది.

సిరిసిల్లలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో 'హెల్పింగ్ హార్ట్స్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కర్రసాములో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. పదిహేనురోజుల పాటు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నేర్పుతున్నారు. 12 సంవత్సరాల బాలికల నుంచి 25 ఏళ్ల మహిళలు, యువతులు ఇందులో పాల్గొనవచ్చు. మొత్తం 60 మంది ఈ శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ శిక్షణ 21 వరకు కొనసాగుతుంది. ఇందులో ప్రావీణ్యం పొందడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆత్మస్థైర్యం పొందుతారు. తమను తాము రక్షించుకోగలమనే ధైర్యం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది - శ్రీనిజ



నేను సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. కర్రసాములో శిక్షణ పొందడం చాలా ఆనందంగా ఉంది. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం ఏర్పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది.

ఆత్మస్థైర్యం పెరుగుతుంది - సంజన



నేను ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. పండగ సెలవులకు ఇంటికి వచ్చాను. హెల్పింగ్ హార్ట్స్ వారు ఉచితంగా కర్రసాము శిక్షణ అందించడం హర్షణీయం. కఠిన పరిస్థితుల్లోనూ మనల్ని మనం రక్షించుకోగలమనే ఆత్మస్థైర్యం ఏర్పడుతుంది.

ఎంతో అవసరం



బాలికలు, మహిళలపై రోజురోజుకీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. అందుకే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. 60 మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- కనుకుంట్ల పున్నంచందర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి - వొడ్నాల శ్రీనివాస్, శిక్షకుడు



బాలికలు, మహిళలు ఉచిత కర్రసాము శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల అనేక లాభాలున్నాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. జీవితంలో కఠిన పరిస్థితులను ఎదుర్కొనేలా ఇవి మనల్ని తయారు చేస్తాయి.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు వరద 52,830 క్యూసెక్కులకు పెరిగింది. 10 స్పిల్‌వే గేట్లను తెరచి 31,240 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఎస్కేప్‌గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులను గోదావరిలోకి మళ్లిస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని వదిలి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఇతర కాలువలు, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 52,380 క్యూసెక్కులుగా ఉంది.